క్లుప్తంగా

శ్రీకృష్ణ మందిరానికి విరాళం


రూ.2 లక్షల విరాళం అందజేస్తున్న నాయకులు

తలుపుల: మండలంలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీకృష్ణ మందిరానికి వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి రూ.2 లక్షలు విరాళం ఇచ్చారు. బుధవారం ఈ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరాం చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. విరాళం అందించినందుకు కమిటీ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీ రిటర్న్‌ల దాఖలుకు చివరి తేదీ 31

కదిరి: రిటైర్డ్ ఉద్యోగులందరూ ఈనెల 31లోపు తమ ఆదాయ పన్ను రిటర్న్‌లను దాఖలు చేసుకోవాలని కదిరి డివిజన్ పెన్షనర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బీవీ శివారెడ్డి, ఆత్మారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలు పైబడిన ప్రతి రిటైర్డ్ ఉద్యోగి ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయాలన్నారు. అది కూడా కేవలం ఈ ఫైలింగ్ ద్వారానే రిటర్న్‌లు దాఖలు చేయాలని సూచించారు. ప్రతి రిటైర్డ్ ఉద్యోగి ఈ విషయాన్ని గమనించి నిర్దేశించిన గడువులోపు ఐటీ రిటర్న్స్ దాఖలు చేయాలని పేర్కొన్నారు.

మానవత్వం చాటుకున్న ఆర్టీసీ కంట్రోలర్


వృద్ధుడిని ఆటోలో పంపిస్తున్న ఆర్టీసీ కంట్రోలర్ ఉత్తన్న

కదిరి టౌన్: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తిని సొంత ఖర్చులతో ధర్మవరానికి పంపించి మానవత్వం చాటుకున్నారు ఆర్టీసీ కంట్రోలర్ ఉత్తన్న. వివరాలు.. స్థానిక బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతూ తలదాచుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ కంట్రోలర్ ఉత్తన్న బుధవారం సదరు వ్యక్తిని పలకరించారు. అనారోగ్యానికి గురైన సదరు వ్యక్తి నుంచి దుర్వాసన వస్తుండటంతో చలించిపోయారు. ధర్మవరానికి చెందిన వాసు యాదవ్ అని తెలుసుకున్న ఆర్టీసీ కంట్రోలర్.. సొంత డబ్బుతో దుస్తులు అందజేశారు. అనంతరం ఓ ఆటోలో అతడిని ధర్మవరానికి పంపించారు. ఆర్టీసీ కంట్రోలర్ ఉత్తన్నను ఆర్టీసీ డీఎం మైనుద్దీన్ అభినందించారు.

గంగాధర్‌పై చర్యలు తీసుకోండి


నిరాహార దీక్ష చేస్తున్న న్యాయవాదులు

కదిరి టౌన్: కదిరి న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడి చేసిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం రెండో రోజు కోర్టు సమీపంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. న్యాయవాదిపై దాడి జరిగిన వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. పోలీసులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామన్నారు. న్యాయవాదులకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

ఘనంగా ఏకలవ్య జయంతి


ఏకలవ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం ఏకలవ్య జయంతిని ఎరుకల సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా ఎరుకల సంఘం ఉపాధ్యక్షుడు ఎరుకల శంకర్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏకలవ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరుకలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వారిని ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. ఎరుకల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు, భవనానికి స్థలాన్ని కేటాయించాలన్నారు. ఏకలవ్య జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎరుకల రుద్ర, ముసలయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి

బత్తలపల్లి: మొహర్రం వేడుకల్లో చివరి రోజు మండల పరిధిలోని పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ముష్టూరు గ్రామాల పీర్లు బత్తలపల్లి చిన్నఖాసీం, పెద్ద ఖాసీం స్వాములతో భేటి అయ్యాయి. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో నిలిపిన పీర్లకు ఆయా గ్రామాల్లో చెక్కెర చదివింపులు చేశారు. భక్తులు మొక్కుబడుల రూపంలో బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులను చెల్లించుకున్నారు. ఆడ, మగ అన్న బేధం లేకుండా అందరూ అలావ్ తొక్కుతూ వేడుకలను జరుపుకున్నారు. అంతకుముందు బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు కాశీంస్వామి పీరును మోసి మొక్కులు చెల్లించుకున్నారు.

తాడిమర్రిలో..

తాడిమర్రి: మండల కేంద్రంలో బుధవారం మొహర్రం ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కుల్లాయస్వామి, అక్బర్, పెద్ద కాశీం, చిన్న కాశీం తదితర పీర్లకు ముల్లాసాబ్ నూతన వస్త్రాలు, వెండి గొడుగులు తొడిగి, పూలమాలతో అలంకరించారు. తెల్లవారు జామున 4:30 గంటల నుంచి పీర్లను గ్రామంలో వీధుల్లో డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. ముందుగా స్వాములను అగ్ని గుండం ప్రవేశం చేయించారు. వీధుల్లో బొమ్మలు, గాజుల దుకాణాలు వెలిశాయి. తాడిమర్రి గ్రామంతో పాటు శివంపల్లి, మోదుగులకుంట, మద్దులచెర్వు, బంగారంపేట, మేడిమాకులపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపు..

తనకల్లు: మండల కేంద్రంతో పాటు దుగినేపల్లి, ఉస్తినిపల్లి, కుంటమరువ, కోటూరు, కొక్కంటి, ఈతోడు, కొక్కంటిక్రాస్ గ్రామాలలో బుధవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. భైరాగిస్వామి గుట్ట వద్ద ఐదు గ్రామాలకు చెందిన పీర్లు మొత్తం ఒకేచోట భేటీ అయ్యాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మండలం నుండే కాకుండా చుట్టుపక్కల మండలాల నుండి భారీ ఎత్తున భక్తులు, ప్రజలు తరలివచ్చారు. ముజావర్లు ఫాతేహాలు చేసి భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆయా గ్రామాల్లో యువకులు చావడి (మకాన్) వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ డప్పు వాయిద్యాల నడుమ అలావ్ తొక్కుతూ సందడి చేశారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ఎన్పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు, పెడబల్లి గ్రామాల్లో బుధవారం జలధి వేడుకలు నిర్వహించారు. తొమ్మిది రోజులుగా పీర్లచావిళ్లలో కొలువుదీరిన పీర్లకు దూపం వేసి ప్రార్థనలు చేశారు. పీర్లను పూలహారాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామాల్లోని వీధుల్లో ఊరేగించారు. ముజావర్లు చెక్కెర చదివింపులు చేశారు.

గాండ్లపెంట: మండల కేంద్రంతో పాటు తూపల్లి, గొల్లపల్లి, జీనులకుంట, ఎనుములవారిపల్లి గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. గాండ్లపెంట, జీనులకుంట పీర్లు మండల కేంద్రానికి సమీపంలోని జల్ది గడ్డకు తరలివెళ్లాయి. తూపల్లి, గొల్లపల్లి, ఎనుములవారిపల్లి గ్రామాల్లోనూ పెద్దమౌలాలి, చిన్నమౌలాలి, చిన్నపీర్లను ఊరేగించారు. ఎస్‌ఐ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

జలధికి తరలిన పీర్లు..

తలుపుల: మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం ఆయా గ్రామాల్లోని పీర్లు జలధికి తరలివెళ్లాయి. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో కుమ్మరపేట, ఎగువపేట పీర్లు ఒక చోట కలవడంతో సందడి నెలకొంది. గురువారం మస్తాన్‌వలి ఉరుసు పీరు ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నల్లమాడ: మండలంలోని పుల్లగూరపల్లి, గోపేపల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం జలధి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పీర్ల స్వాములకు పెద్ద సరిగెత్తు నిర్వహించి రాత్రి పీర్లను గ్రామాల్లో ఊరేగించారు. జలధి సందర్భంగా ఉదయాన్నే పీర్ల చావిడి ముందు గుండం వద్ద పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చారు. సాయంత్రం గుండం చుట్టూ యువకులు, ఉత్సాహవంతులు తప్పెట దరువులకు అనుగుణంగా ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ అలావ్ తొక్కారు. అనంతరం పీర్లస్వాములతో గుండం ప్రవేశం చేయించి జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుండా ఆయా గ్రామాల్లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. కనగానపల్లిలో జరిగిన దస్తగిరి, ఒన్నూరు స్వామి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొహర్రం వేడుకల్లో ప్రధాన ఘట్టమైన జలధి కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేయించి ఊరేగింపుతో జలధికి తరలించారు. దీంతో పాటు తగరకుంట, యలకుంట్ల, నరసంపల్లి గ్రామాల్లో కూడా మొహర్రం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో యువకులు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


తనకల్లు భైరాగి స్వామి గుట్ట వద్ద పీర్లను దర్శించుకుంటున్న భక్తులు


గాండ్లపెంటలో జలధికి తరలుతున్న పీర్లు


తలుపుల: జలధికి వెళ్తున్న పీర్లు


బత్తలపల్లిలో ఊరేగుతున్న పెద్ద కాశీం స్వామి


పోట్లమర్రిలో..


నల్లమాడ: గోపేపల్లిలో భక్తిగీతాలపన


తాడిమర్రిలో పీర్ల ఊరేగింపు


కనగానపల్లిలో..


ఎన్పీకుంట: ధనియానిచెరువులో..

రైతుల రుణాలు మాఫీ చేయండి


కదిరి: చంద్రబాబు సర్కారు రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి. రైతుల అన్ని రకాల రుణాలు వెంటనే మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సమస్యలపై ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ప్రతి ఏటా రూ.20 వేలు రైతు భరోసా నగదు ఇస్తామని చెప్పారన్నారు. ఖరీఫ్ సాగు గడువు ముగుస్తున్నా ఇప్పటి దాకా ఈ ప్రభుత్వం రైతు ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ చేసిన పాపాన పోలేదన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం తక్షణం చెల్లించాలని కోరారు. కౌలు రైతులకు సైతం గుర్తింపు కార్డులు ఇచ్చి, రైతులతో సమానంగా రైతు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. పట్టు రైతులను ప్రోత్సహించేందుకు మరిన్ని సబ్సిడీలు అందజేయాలన్నారు. వ్యవసాయం గిట్టుబాటు లేదని జిల్లాలో చాలామంది రైతులు పాడి వైపు దృష్టి సారించారని గుర్తు చేశారు. పాలధర మరింత పెంచాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల విస్తరణ పేరుతో బాగా పంటలు పండే భూములను రైతుల నుంచి తీసుకున్నారన్నారు. కానీ రైతులకు పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ధర్మవరం అర్బన్: సివిల్ సప్లయ్‌లో పని చేసే హమాలీలకు ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, బుక్కపట్నం మండలాల్లోని స్టాక్ పాయింట్ల హమాలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయ్ హమాలీలకు ప్ర తినెలా డీలర్ల నుంచి వస్తున్న కూలి చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే సక్రమంగా చెల్లించాలన్నారు. జిల్లాలో 12 స్టాక్ పాయింట్లలో 200 మందికిపైగా హమాలీలు ఉన్నారని.. వారికి సరిపడా కూలి గిట్టుబాటు కాలేదన్నారు. స్వీపర్, వాచ్‌మెన్‌లకు సుమారు 7 నెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే వారు కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలకోటప్ప, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రాందాసు, మేస్త్రీలు ఆంజనేయులు, గంగాధర్, కదిరప్ప, కోటప్ప, సీఐటీయూ మండల అధ్యక్షులు ఆదినారాయణ, కార్యదర్శి అయూబ్‌ఖాన్, జిల్లా నాయకులు జేవీ రమణ, ఎస్‌హెచ్ బాష, రైతు సంఘం అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, మారుతి తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి అమానుషం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కదిరి టౌన్: వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నా పేరూర్ గ్రామానికి చెందిన దళిత ప్రభాకర్‌ను అదే గ్రామానికి చెందిన గజ్జల వెంకట సుబ్బారెడ్డి కులం పేరుతో దూషించడం అమానుషం. వేడి నూనె పోసి దాడి చేయడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా చైర్మన్ కదిరిప్ప, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా నాయకుడు ఉపేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలో జరిగిన విలేరుల సమావేశంలో వారు మాట్లాడారు. దళితుడైన ప్రభాకర్ అరుగుపై కుర్చొన్నాడని నెపంతో దాడి చేయడం జరిగిందన్నారు. దాడి చేసిన వెంకట సుబ్బారెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీల రక్షణకు ఎన్ని చట్టాలు తెచ్చినా ఇంకా దళితులపైన దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్, తిప్పన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: ఆధార్‌కార్డును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని చెన్నేకొత్తపల్లి ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం జరుగుతుందన్నారు. 23న చెన్నేకొత్తపల్లి -1 , 24న న్యామద్దెల -1, 25న ప్యాదిండి, 26న మేడాపురం-1, 27న కనుముక్కల-1 సచివాలయాల్లో సిబ్బంది ఆధార్ అప్‌డేట్ చేస్తారన్నారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు..

తనకల్లు: మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో ఈనెల 23 నుంచి ఆధార్ కార్డ్ అప్‌పేడ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ కృష్ణమూర్తి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న తనకల్లు-1, 2, 3 గ్రామ సచివాలయాలు, 24వ తేదీన కోటపల్లి, టీ.సదుం, 25న మల్లిరెడ్డిపల్లి, బాలసముద్రం, 26వ తేదీన చీకటిమానిపల్లి, గేమేనాయక్ తండా, 27వ తేదీన ఈతోడు, బొంతలపల్లి సచివాలయాల్లో ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

బత్తలపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరుకావాలన్నారు. అదేవిధంగా మండల స్థాయి అధికారులందరూ తప్పకుండా తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

రేపు 'డయల్ యువర్ మేనేజర్'

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలను తెలియజేసేందుకు ఈనెల 19వ తేదీన ఉదయం 11 గంటల నుంచి 12:30 గంటల వరకూ డయల్ యువర్ మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఇనయతుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలు, సలహాలు, సూచనలను 9959225857 నంబర్‌కు కాల్ చేసి చెప్పుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా తొలి ఏకాదశి


ధర్మవరం అర్బన్: బాలికలతో ప్రత్యేక పూజలు చేయిస్తున్న పూజారులు

తాడిమర్రి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రం, స్థానిక పురాతన శివాలయం, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, ఏకపాదంపల్లి, నార్సింపల్లి గ్రామాల్లోని లక్ష్మీనర సింహస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆయా ఆలయాల్లో ముందుగా ఆలయ పూజారులు స్వామి మూలవిరాట్‌లకు పంచామృతం అభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం భక్తులు స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయాల్లో అభిషేకాలు..

బత్తలపల్లి: తొలి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాలు, ఇళ్లల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో పంచామృతాభిషేకాలు జరిగాయి. రైతులు పొలాల్లో వినియోగించే పరికరాలను, గడ్డికి పూజలు చేశారు.

లక్ష్మీ చెన్నకేశవ స్వామికి పూజలు

ధర్మవరం అర్బన్: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి నూతన పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం సహస్రనామ అర్చన, మహా నైవేద్యం, మంత్రపుష్ప సమర్పణ, పంచమ వాద్యాల నడుమ హారతులు ఇచ్చారు.

ఘనంగా అక్కమ్మ దేవతల పరుష

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురంలో ఉన్న అక్కమ్మ దేవతల పరుష బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజారి గుంజర మహేష్, బయన్నల ఆధ్వర్యంలో అక్కమ్మ దేవతలను ప్రత్యేకంగా వెండి గొడుగులతో అలంకరించారు. బాలికలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గుట్టకిందపల్లికి చెందిన గరుడంపల్లి కేశమ్మ, బాలు కుటుంబ సభ్యులు అమ్మవారికి 7 తులాల వెండి నాగ పడగ అందించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేపట్టారు. అనంతరం అన్నదానం చేశారు.


పుట్టపర్తి అర్బన్: అలంకరణలో ఓబులేశ్వరుడు


ధర్మవరం అర్బన్: అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి

ఓబులేశ్వరుడి కొండపై ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: ఓబులేశ్వర స్వామి కొండపై తొలి ఏకాదశి ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరుబయట ఉన్న స్వామికి పంచలోహ కవచం అలంకరించి పూజలు నిర్వహించారు. కొండపైకి కాలి నడకన వెళ్లి ఉపవాస దీక్షలు విరమించారు. గురువారం పలారం బండ్లతో ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహిస్తారు. కొండ దిగువ భాగాన కల్యాణ మంటపం నిర్మిస్తున్నారు. భక్తులు విరాళాలు అందజేయాలని కమిటీ అధ్యక్షుడు గోవిందప్ప, గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, సలహాదారు వాసుదేవరెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఉమాపతి పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

కమనీయం.. కల్యాణం


వేంకటేశ్వరుడికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి సమీపంలోని ఎనములపల్లి గ్రామంలో వెలసిన హరహర క్షేత్రంలో బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని హరహరక్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అర్చకులు శ్రీదేవి, భూదేవి సహిత వేంటేశ్వర స్వామికి కల్యాణం జరిపించారు. అలాగే నరసింహ స్వామి, ఎల్లమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం విగ్రహాలను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన వైద్య శిబిరాలు

నల్లమాడ: శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మండలంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపులు బుధవారం ముగిశాయి. చివరి రోజు సీ.బడవాండ్లపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి విచ్చేసిన వైద్య బృందం వివిధ జబ్బులతో వచ్చిన రోగులకు వైద్య చికిత్సలు అందించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 15న దొన్నికోట, 16న కొండక్రింద తండాలో ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించడం జరిగింది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా స్ఫూర్తితో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సూచన మేరకు ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ యూరోప్ జోన్ చైర్మన్ ఫిలిప్ తెలిపారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఎన్పీకుంట: అనంతపురంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డిని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హరిప్రసాద్‌రెడ్డి రాష్ట్రోపాధ్యాయ సంఘంలో సుమారు 18 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో పని చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. సంఘం బలోపేతం కోసం అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. ఆయన సేవలను గుర్తించి సంఘం తరఫున సన్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, రామాంజనేయులు, సూర్యుడు, చంద్రశేఖర్, సుధాకర్, శ్రీనివాసులు, గోవిందునాయుడు పాల్గొన్నారు.

పారదర్శకంగా కుష్టు నివారణ సర్వే


మాట్లాడుతున్న వైద్యాధికారులు


ఓడీచెరువు: కుష్టు నివారణ సర్వేను పారదర్శకంగా చేపట్టనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణ, బాధితుల గుర్తింపు, ఎల్‌సీడీ కార్యక్రమంపై సిబ్బందితో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణలో భాగంగా ప్రతి సంవత్సరం జూలై 18 నుంచి ఆగస్టు 2 వరకూ ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతోందన్నారు. ఉచిత మందుల పంపిణీ, ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి పింఛన్‌కు సిఫారసు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్టుపై అపోహలు తొలగించాలని డాక్టర్ కమల్ రోహిత్ తెలిపారు.

శుద్ధ జలం అందించాలి


జేజేఎం పనులపై ఆరా తీస్తున్న అధికారులు

ముదిగుబ్బ: గ్రామీణ ప్రజలకు శుద్ధ జలం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్‌ను ప్రవేశపెట్టిందని కేంద్ర బృందం అధికారులు అనిల్‌కుమార్ బారి, శశికుమార్ బషీర్ తెలిపారు. బుధవారం మండలంలోని సంకేపల్లి, పీసీరేవు, సానేవారిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి సరఫరా విధానం, నీటి నాణ్యత, వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుధ్య తదితర పనులపై , జేజేఎం మేనేజర్ పవన్ శ్రీ, డీసీఐఎస్‌ఏ మూర్తితో కలిసి ఆరా తీశారు. మిగిలిన పనులను వెంటనే చేపట్టి ప్రజలకు తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు.

పరామర్శ


సంతాపం తెలియజేస్తున్న దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్‌కు చెందిన పొగాకు బాషా అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీత, సిభక్తుల్లా, రంగారెడ్డి, అన్సర్ బాషా, ఉత్తప్ప, గంగాధర్, తబ్రేజ్, బాబురెడ్డి, హనుమంతరెడ్డి, రమేష్, జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.